సాక్షి
నిజామాబాద్
సోమవారం । 25 । మార్చి । 2024



సాఫ్ట్‌బాల్ చాంపియన్‌గా..

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది.

- 8లో ▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్ సోమ : 6:34

సహర్ మంగళ : 4:54

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.5/25.6

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు కలెక్టర్ హోలీ శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ప్రజలకు ఆదివారం ఓ ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరినీ ఒక్క చోట చేర్చే ఈ హోలీ వేడుక ప్రజలందరి జీవితాల్లో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హోలీ పండుగను జరుపుకోవాలని కలెక్టర్ అభిలాషించారు.

వైన్ షాపులు బంద్



ఖలీల్‌వాడి: హోలీ సందర్భంగా కమిషనరేట్ పరిధిలోని వైన్ షాపులు మూతపడ్డాయి. ఆదివారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు, బార్, కల్లు దుకాణాలు మూసివేయాలని సీపీ కల్మేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేసినా, గొడవలు సృష్టించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ



దోమకొండ : తమిళనాడులో జరిగిన ఖేలో ఇండియా అర్చరీ పోటీల్లో దోమకొండకు చెందిన కదిరె సింధూజ ప్రతిభ చూపినట్లు కోచ్ ప్రతాప్‌దాస్ తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో జరిగిన పోటీల్లో ఇండియా సౌత్ జోనల్ ఓపెన్ అర్చరీ పోటీల్లో సింధూజ కాంస్య పతకంతో పాటు, రూ.10 వేల నగదును గెలుచుకున్నట్లు చెప్పారు. ఆమెను అర్చరీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కామినేని అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్ర యోగా జట్టు మేనేజర్‌గా నగేశ్

కామారెడ్డి అర్బన్ : జాతీయ స్థాయి సీనియర్ మెన్ యోగా పోటీలు ఈ నెల 28 నుంచి 31 వరకు తమిళనాడులో జరగనున్నాయి. ఈ పోటీలకు రాష్ట్ర యోగా జట్టు మేనేజర్‌గా అడ్లూర్ ఎల్లారెడ్డి ఉన్నత పాఠశాల పీఈటీ నగేశ్ వ్యవహరించనున్నట్లు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



ఇందల్వాయిలో రాతి గుండును ఎత్తిన యువకుడు


జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్‌లో కామదహనం చేస్తున్న ఆర్యసమాజ్ సభ్యులు

ఘనంగా కామదహనం

హోలీ వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కామదహనం నిర్వహించారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామాల్లోని చౌరస్తాల వద్ద పూజలు చేసి కామదహనం చేశారు. జిల్లా కేంద్రంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సోమవారం హోలీ సంబరాలు నిర్వహించనున్నారు. అలాగే ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలు జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు.

కబ్జాలు.. ఆపై దాడులు!

- బాధితులపై హత్యాయత్నాలకు తెగబడుతున్న పరిస్థితి
- ఆక్రమణలే పనిగా వ్యవహరిస్తున్న కొందరు ప్రజాప్రతినిధులు
- నేతల అండతో రెచ్చిపోతున్న మూకలు



నగరంలో కబ్జాకు గురయిన రామర్తి చెరువు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ నగరం పరిధిలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమిద్దాం.. తర్వాత అమ్మేద్దామనే లక్ష్యంతోనే కొందరు ప్రజాప్రతినిధులు వ్యవహరిస్తున్నారు. కబ్జాల విషయంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం నాయకులు కలిసికట్టుగా కథలు నడిపిస్తుండడం గమనార్హం. ప్రభుత్వం మారినప్పటికీ ఆయా పార్టీల వ్యవహారాల్లో మాత్రం మార్పు రాకపోవడం విశేషం. ప్రభుత్వ, అటవీ భూములు, కెనాల్స్, చెరువుల్లో సైతం వెంచర్లు వేసి ఆ స్థలాలను విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇవి చాలదన్నట్లు కొందరు వ్యక్తులు కార్పొరేటర్ల అండ చూసుకుని అమాయకుల ఆస్తులను సైతం దౌర్జన్యంగా దక్కించుకుంటుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

■ రెవెన్యూ అధికారుల కక్కుర్తి అమాయకులకు అన్యాయం జరిగేలా చేసింది. నగరంలోని 10వ డివిజన్‌లో నాగారం దుర్గానగర్ కాలనీలోని 50 క్వార్టర్స్ ఏరియాలో గుండారపల్లి పద్మావతి అనే మహిళ 2015లో మేయర్ అనుచరుల వద్ద నుంచి 6,500 గజాల భూమిని రూ. 35లక్షలకు కొనుగోలు చేశారు. అనంతరం పద్మావతి, మరికొందరు సభ్యులు చాముండేశ్వరి సంస్థ ఆధ్వర్యంలో రేణుక ఆలయం నిర్మించారు. అయితే ఈ భూమి 2102 సర్వే నంబరులో ఉంది. 1954 సేత్వార్ లెక్కల ప్రకారం ఈ సర్వే నంబరులో ఉన్నదంతా ప్రభుత్వ భూమి. ఇక పహాణీలో మాత్రం 2102, 2103 సర్వే నంబర్లలోని భూమి మెడికల్ కాలేజీకి ఉన్నట్లు చూపిస్తోంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల కక్కుర్తి కారణంగా 2005–06లో మెడికల్ కాలేజీ స్థానంలో గులాబ్‌సింగ్ అనే పేరు వచ్చి చేరింది. ఇందులో మతలబు ఏమిటో రెవెన్యూ అధికారులకే తెలియాలి. ఈ క్రమంలో పద్మావతికి గతంలో ఈ భూమిని అమ్మిన మేయర్ అనుచరులే రెండేళ్ల క్రితం పద్మావతి కుటుంబ సభ్యులపై దాడిచేయడం గమనార్హం.

■ స్లాటర్ హౌజ్ వెనుక జల్‌తలాబ్ అనే ప్రాంతంలో రెండు గుట్టల మధ్య ఉన్న చెరువు పక్కన ఉన్న అటవీ భూమిలో సైతం ఓ కీలక ప్రజాప్రతినిధి అక్రమంగా వెంచర్ వేశారు. అటవీ సరిహద్దు దిమ్మె వద్దనే ఏకంగా వెంచర్ సరిహద్దు రాయి పాతారు. ఇక్కడికి వెళ్లేందుకు రోడ్డు సైతం లేకపోవడంతో స్లాటర్ హౌజ్ వెనుక ఉన్న గోడ ను కూల్చి రోడ్డు వేశారు. అక్రమ వెంచర్‌లోనూ రోడ్డు వేయడం గమనార్హం. ఈ చెరువు చుట్టూ గుట్టలు ఉన్నాయి. గుట్టలపై రక్షిత అటవీ భూమి ఉంది. బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి, ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కొందరు నాయకులు, అదేవిధంగా మరికొందరు రౌడీషీటర్లు కలిసి ఏకంగా చెరువులో 12 ఎకరాలు ఆక్రమించారు. పెద్ద వర్షం వస్తే మునిగిపోయే ఇక్కడ చదును చేసి ప్లాట్లు చేశారు.

■ నుజహత్ కాలనీలోని నిజాంసాగర్ కెనాల్ కట్ట ప్రాంతంలో సుమారు మూడెకరాలను ఆక్రమించిన కొందరు బీఆర్‌ఎస్, ఎంఐఎం నాయకులు ప్లాట్లు చేసి అమ్మేశారు. ఇలా అమ్మిన ప్లాట్లు ఇప్పటికే రెండుమూడు చేతులు మారడం గమనార్హం. ఇలా భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

■ అర్సపల్లి రామర్తి చెరువు మొత్తం 28 ఎకరాలుండగా ప్రస్తుతం అది 8 ఎకరాలకు తగ్గిపోయింది. ఈ చెరువును ప్రధాన రహదారి వైపు, వెనుక వైపు దాదాపు 70 శాతం ఆక్రమించి అక్రమంగా ప్లాట్లు చేసి కొందరు కీలక ప్రజాప్రతినిధులు యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. రెవెన్యూ అధికారులు సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంతో చెరువును ఎక్కువ విస్తీర్ణంలో పూడ్చేశారు. ఆక్రమించిన భాగాన్ని వదిలిపెట్టి మిగిలిన కొంతభాగం చెరువుకు మాత్రం రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ వేయడంపై పలువురు ఆశ్చర్యపోతున్నారు. నగరానికి చెందిన ప్రధాన ప్రజాప్రతినిధులు మాత్రం తమకు ఎదురే లేదన్నట్లు దందా చేస్తున్నారు. ఇక రామర్తి చెరువు అభివృద్ధి కోసం గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి వేసిన పైలాన్ సైతం మాయమైంది.



■ గత నెల 13న రాత్రి సమయంలో కంఠేశ్వర్ చర్చి ప్రాంతంలో కొందరు వ్యక్తులు అహ్మద్‌పుర కాలనీకి చెందిన మహ్మద్ ఫరూఖ్ అనే వ్యక్తిపై హాకీ కర్రలతో హత్యాయత్నం చేశారు. విషయమేమిటంటే అహ్మద్‌పుర ఏరియాలో ఫరూఖ్ కుటుంబానికి చెందిన నాలుగు మడిగెల్లో రెండింటిని 2002లో అబ్దుల్ రహీం అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. కొంతకాలానికి కిరాయి సక్రమంగా చెల్లించకపోవడంతో 2012లో ఖాళీ చేయాలని ఫరూఖ్ చెప్పడంతో రహీం కోర్టును ఆశ్రయించాడు. తర్వాత 2017లో స్టే రద్దయ్యింది. దీంతో పంచాయితీ ఎంఐఎం నాయకుల వద్దకు చేరింది. మూడేళ్ల తర్వాత ఖాళీ చేసేలా ఒప్పందం కుదిరినప్పటికీ తర్వాత అది జరగలేదు. పైగా కిరాయి సైతం చెల్లించలేదు. మళ్లీ 2022 అక్టోబర్ 30కి మరోసారి స్టే తెచ్చాడు. దీంతో ఫరూఖ్ అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలను కలిశాడు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. చివరకు ఫరూఖ్‌పై హత్యాయత్నం చేసేవరకు వ్యవహారం నడిచింది. ప్రస్తుతం ఫరూఖ్ రెండు చేతులకు, ఒక కాలికి తీవ్రమైన ఫ్యాక్చర్లు కావడంతో 40 రోజులుగా మంచంపైనే ఉన్నాడు. తనకు ప్రాణహాని ఉందని బాధితుడు వాపోతున్నాడు.

మైనారిటీల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

రాష్ట్ర మంత్రి సీతక్క




ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

ఖలీల్‌వాడి: మైనారిటీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ధర్మ పురి కాలనీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముస్లింల రిజర్వేషన్స్ తొలగించడం మోదీ తరం కాదన్నారు. తమ ప్రభుత్వం ముస్లింలకు అమలు చేస్తోన్న నాలుగు శాతం రిజర్వేషన్‌ను తొలగిస్తానంటూ హైదరాబాద్ పర్యటన సందర్భంగా అమిత్ షా చెప్పారని, అది సాధ్యం కాదన్నారు. రిజర్వేషన్ కోసం దేశ అత్యున్నత న్యాయస్థానంలో పోరాడామని, దాన్ని కాపాడే బాధ్యత కూడా తమదేనన్నారు. తమది సెక్యులర్ ప్రభుత్వమని, అందరినీ కలుపుకొని వెళ్తుందని వ్యాఖ్యానించారు. హిందువులు, ముస్లింలు తనకు రెండు కళ్లలాంటి వారన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నాయకులు కేశ వేణు, నరాల రత్నాకర్, హారున్, ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- తెయూను సందర్శించిన ఇన్‌చార్జి వీసీ వెంకటేశం
- రూ. ఏడు కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణం



తెయూ సైన్స్ కాలేజ్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్‌లో రూ. 18 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సైన్స్ కాలేజ్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెయూ ఇన్‌చార్జి వీసీ, సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఆదేశించారు. ఆదివారం ఆయన వర్సిటీని సందర్శించారు. వర్సిటీ రిజిస్ట్రార్‌తో పాటు ఏఈ వినోద్‌తో కలిసి సైన్స్ కాలేజ్ భవనాన్ని పరిశీలించారు. సెమినార్ హాల్ ఏర్పాటుకు, ఆడిటోరియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. వర్సిటీ బాలుర, బాలికల హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే రూసా ద్వారా విడుదలైన రూ. 10కోట్ల నిధుల నుంచి నూతన బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల అనంతరం పనులు ప్రారంభించాలని రిజిస్ట్రార్‌కు సూచించారు. విద్యార్థులు విన్నవించిన సమస్యలను ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే వర్సిటీ లైబ్రరీని తనిఖీ చేశారు. అన్నిరకాల పోటీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని రిజిస్ట్రార్‌కు సూచించారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన కలెక్టర్

వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వెంకటేశంను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరందు, ఆర్డీవో రాజేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వర్సిటీ మెయిన్ క్యాంపస్‌కు సంబంధించి 70 ఎకరాల అంశం కోర్టు కేసులో ఉందని, సారంపూర్ క్యాంపస్‌కు సంబంధించి 60 ఎకరాల భూమికి హద్దులు లేవని రిజిస్ట్రార్ యాదగిరి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని ఇన్‌చార్జి వీసీ కలెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, చీఫ్ వార్డెన్ మహేందర్, అధ్యాపకులు నాగరాజు, కిరణ్మయి, ఏఈ వినోద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, లైబ్రేరియన్ సత్యనారాయణ, సూపరిండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

వన్నెల్(బి) టు సాంగ్లీ..!

- పసుపు తరలిస్తున్న వ్యాపారులు
- వన్నెల్(బి)లోనే కాంటాలు
- ఇక్కడే ధర ఓపెన్
- రైతులకు తప్పిన ఎగుమతి ఖర్చులు



బాల్కొండ: బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామం నుంచి మహారాష్ట్రని సాంగ్లీ మార్కెట్‌కు పసుపు తరలిస్తున్నారు. పంటకు ధర, కాంటాలు అంతా వన్నెల్(బి)లోనే నిర్వహిస్తున్నారు. ఒక రకంగా సాంగ్లీ మార్కెట్‌ను అక్కడి వ్యాపారుల ప్రతినిధుల ద్వారా ఇక్కడే నిర్వహిస్తున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పసుపు పంటకు ప్రస్తుత సంవత్సరం మంచి ధర లభిస్తోంది. ఇందూరు మార్కెట్ కంటే సాంగ్లీలో ధర అధికంగా పలుకుతోంది. దీంతో వన్నెల్(బి), అంక్సాపూర్, హాసాకొత్తూర్, గుమ్మిర్యాల్ గ్రామాల నుంచి అధికంగా సాంగ్లీ మార్కెట్‌కు పసుపు ఎగుమతి చేస్తున్నారు. ఎగుమతి చేయడానికి క్వింటాల్‌కు రూ.వేయి నుంచి రూ.1200 వరకు ఖర్చు అవుతోంది. ఎగుమతి ఖర్చులు భారం కావడంతో కొంత మంది రైతులు ఇందూర్ మార్కెట్‌కు తరలించుటకు మొగ్గు చూపారు. కాని పసుపు పంటకు మంచి డిమాండ్ ఉండటంతో సాంగ్లీ వ్యాపారులు ఇక్కడే ధర నిర్ణయించి, కాంటాలు వేస్తు సాంగ్లీకి ఎగుమతి చేస్తున్నారు. దీంతో రైతులకు ఎగుమతికి అయ్యే ఖర్చు కలిసి వస్తోంది.

క్వింటాల్‌కు రూ.19,500 వరకు పలికిన ధర

వన్నెల్(బి)లో సాంగ్లీ వ్యాపారుల ప్రతినిధులు కొనుగోలు చేసిన పసుపులో గరిష్టంగా క్వింటాలుకు రూ.19,500 ధర స్థానిక రైతు వెల్మ రమేశ్‌కు పలికింది. ఇదే పసుపు సాంగ్లీకి తీసుకెళ్లిన రూ.500 అదనంగా వచ్చేవి అని రైతులు అంటున్నారు. ఎగుమతులు ఖర్చులు పోతే మళ్లీ అంతే అవుతుందని రైతులు అంటున్నారు. క్వింటాలుకు 16 వేల కంటే తక్కువ ధర పలకడం లేదని రైతులు అంటున్నారు. వన్నెల్(బి) గ్రామంలో రైతులు నాణ్యమైన పసుపును పండించడం కూడ ఇక్కడనే మార్కెట్ నిర్వించుటకు కారణమవుతుందని రైతులు అంటున్నారు. ప్రస్తుత సంవత్సరం పసుపు పంటకు ధర దక్కడం పై అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



సాంగ్లీ మార్కెట్ కోసం అక్కడి వ్యాపారులకు చెందిన వ్యక్తి పసుపు పంటను కొనుగోలు చేస్తున్నాడు. క్వింటాలుకు రూ.19,500 ధర పలికింది. కాంటాలు ఇక్కడే నిర్వహించి పంపించారు. పంటకు మంచి ధర పలకడం ఆనందంగా ఉంది.

– వెల్మ రమేశ్, రైతు, వన్నెల్(బి)

ఖర్చులు తప్పుతున్నాయి



సాంగ్లీ వ్యాపారులు ఇక్కడే పసుపు కొనుగోలు చేయడంతో ఎగుమతి ఖర్చులు తప్పుతున్నాయి. సాంగ్లీకి ఎగుమతి చేయాలంటే క్వింటాల్‌కు సుమారుగా రూ.1200 ఖర్చు అవుతుంది. మంచి ధర దక్కడంతో ఇక్కడే అమ్ముతున్నాం.

– కుంట దేవేందర్, రైతు, వన్నెల్(బి)

'మనఊరు – మనబడి'కి నిధుల్లేవ్

- 2022లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమైన కార్యక్రమం
- తొలి విడత పనులకే చెల్లింపులు లేక అసంపూర్తిగా నిలిపివేత

మోర్తాడ్(బాల్కొండ) : మోర్తాడ్ మండలం సుంకెట్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో 'మనఊరు –మన బడి' కింద 2022 డిసెంబర్‌లో డైనింగ్ హాలు, కిచెన్ షెడ్‌లతో పాటు మూత్రశాలలు, సంప్‌హౌజ్‌ల నిర్మాణం ప్రారంభించారు. ఇందుకు రూ. 29 లక్షలు అంచనా వేశారు. మూత్రశాలలను ఉపాధి హామీ నిధులతో, ఇతర పనులను 'మన ఊరు–మన బడి' నిధులతో నిర్మించాలని నిర్ణయించారు. కానీ ఇప్పటి వరకు కేవలం రూ.5 లక్షల బిల్లులు మాత్రమే చెల్లించారు. మిగిలిన చెల్లింపులకు నిధులు లేకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఏడాదిన్నర కాలంగా చెల్లింపులు లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇలా జిల్లాలోని పాఠశాలల్లో 'మన ఊరు– మన బడి' కింద చేపట్టిన పనులు నిలిచిపోయాయి.

'మనఊరు–మనబడి' కార్యక్రమానికి నిధుల కొరత ఏర్పడింది. 2022లో తొలి విడతలో ఎంపిక చేసిన పాఠశాలల్లో డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, సంప్‌హౌజ్‌లను నిర్మించాలని ప్రతిపాదించారు. జిల్లాలో 1,234 పాఠశాలలుండగా అందులో 407 స్కూళ్లను ఎంపిక చేశారు. 2022–23 విద్యా సంవత్సరానికి చేపట్టిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో రెండో విడత పనులను గుర్తించడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ కార్యక్రమం కింద ఏ పాఠశాలకైనా రూ.30 లక్షలకు మించి నిధులు మంజూరైతే ఆ పనులను టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించాలని నిర్ణయించారు. రూ.30 లక్షలకు తక్కువ నిధులు ఉంటే నామినేషన్ పద్ధతిలో చేపట్టాలని గత ప్రభుత్వం తీర్మానించింది. దాదాపు అన్ని పాఠశాలల్లో నామినేషన్ పద్ధతిలోనే పనులు చేపట్టేలా అంచనాలను తయారు చేశారు. అయితే రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు నిధులు మంజూరైన పాఠశాలల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. రూ.30 లక్షలు అంతకు మించి నిధులు కేటాయించిన చోట పనులు ప్రారంభంకాలేదు. అయితే పనులు మొదలైన చోట కూడా అర్ధంతంగా నిలిచిపోయాయి. బిల్లులు రాకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి పనులు పూర్తిచేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సుంకెట్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్మించిన డైనింగ్ హాల్

జిల్లాలో పనుల తీరు

చివరి దశకు చేరుకున్నవి	275
అసంపూర్తిగా ఉన్నవి	132
ఇప్పటి వరకు చెల్లింపులు	రూ.5.50 కోట్లు
పెండింగ్‌లో ఉన్నవి	రూ.15.50 కోట్లు

నిధులు లేక బిల్లుల నిలిపివేత..

గత అక్టోబర్‌లోనే బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తే చెల్లింపులు జరిపి పనులను పూర్తి చేయిస్తాం.

– సాయన్న, ఏఈ, మన ఊరు మన బడి పనుల ఇన్‌చార్జి

క్లుప్తంగా

సెపక్‌తక్రా రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా లాస్యప్రియ



నిజామాబాద్‌, నాగారం: సెపక్‌తక్రా రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా జిల్లాకు చెందిన క్రీడాకారిణి లాస్యప్రియ వ్యవహరించనున్నట్లు సెపక్‌తక్రా జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాదారి సంజీవ్‌రెడ్డి తెలిపారు. లాస్యప్రియ నేతృత్వంలో రాష్ట్రజట్టు ఈనెల ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించనున్న 26వ సెపక్ తక్రా సబ్ జూనియర్ టోర్నీలో పాల్గొంటుందన్నారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న క్రీడాకారులకు హైదరాబాద్‌లో ఆదివారం స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెపక్ తక్రా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, హైదరాబాద్ సెపక్‌తక్రా అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నట్లు సంజీవ్‌రెడ్డి తెలిపారు.

హజ్ యాత్రికులకు మక్కాలో సౌకర్యాలు



ఖలీల్‌వాడి: హజ్‌యాత్రికులకు మక్కాలలో సౌకర్యాలు కల్పిస్తామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. నగరంలోని బోధన్ రోడ్డులో ఉన్న ఎస్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా డిస్ట్రిక్ట్ హజ్ సొసైటీ మౌలానా సయ్యద్ అబిద్ ఖాస్మీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన రెండో హజ్ ట్రైనింగ్ క్యాంప్‌ను షబ్బీర్ అలీ ప్రారంభించారు. శిక్షణ శిబిరంలో అందిన సలహాలు, సూచనలు పాటించాలని హజ్ యాత్రికులకు సూచించారు. కార్యక్రమంలో బోర్డ్ చైర్మన్ కుస్రోపాషా, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్‌హందాన్ తదతరులు పాల్గొన్నారు.

తెయూ లైబ్రేరియన్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ లైబ్రేరియన్ డి.సత్యనారాయణ డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ లైబ్రేరియన్ డాక్టర్ దామోదర్ పర్యవేక్షణలో 'వెబ్‌సైటేషన్ ట్రెండ్స్ ఇన్ ఓపెన్ ఆక్సెస్ జర్నల్స్ ఆఫ్ ఇంజినీరింగ్ డిసిప్లిన్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఓయూ డిపార్ట్‌మెంట్ రీసెర్చ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సత్యనారాయణకు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. డాక్టరేట్ సాధించిన సత్యనారాయణను ఓయూ అధ్యాపకులతోపాటు తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.


బాన్సువాడను జిల్లా చేయాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : బాన్సువాడను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డికి టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం సీఎంకు బహిరంగ లేఖ రాశారు. అందులో భాగంగా కేవలం 45 కిమీ ఉన్న నిజామాబాద్‌ను వదిలి గత పాలకులు 95 కి.మీ దూరం ఉన్న కామారెడ్డిని జిల్లాగా ప్రకటించారన్నారు. దీని కారణంగా జుక్కల్,బాన్సువాడ నియోజక వర్గ ప్రజలకు దూర భారం పెరుగిందన్నారు. వెటర్నిటీ కళాశాలను ఏర్పాటు చేయాలని, మంజీరా ప రివాహక ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అ క్రమ దోపిడిని అరికట్టేలా చర్యలు తీసుకోవాల ని బహిరంగ లేఖ ద్వారా డిమాండ్ చేశారు.

ప్రీమియర్ లీగ్ ఫీవర్

- ఎన్నికల వేళ మ్యాచ్‌లు
- టీవీలకు అతుక్కుపోతున్న యువత
- ఆన్‌లైన్‌లో జోరుగా బెట్టింగ్‌లు
- ప్రచారం ఎలా అని పరేషాన్ అవుతున్న ఎంపీ అభ్యర్థులు

రాజకీయ నాయకులకు, యువతకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫీవర్ పట్టుకుంది. మ్యాచ్‌లు వీక్షిస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో యువత బిజీగా మారగా, ఎన్నికల వేళ తమకు ప్రచారం చేసేదెవరని నాయకులు తలలు పట్టుకుంటున్నారు.



ఖలీల్‌వాడి: ఓవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), మరోవైపు పార్లమెంట్ ఎన్నికల షెడ్యుల్ విడుదల నేపథ్యంలో అటు రాజకీయ నాయకులు, ఇటు యువత ఎవరికి వారు బిజీ అయ్యారు. ఎన్నికల్లో పూర్తిగా యువతపై ఆశలు పెట్టుకున్న రాజకీయ పార్టీల నాయకులు ఎప్పుడు తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ప్రచారం, ఓటర్లను కలవడం, ప్రజల అవసరాలను గుర్తించడంతోపాటు ఓటరు నాడిని తెలుసుకోవడంలో యువతదే కీలక పాత్ర. అయితే, ఐపీఎల్ కారణంగా యువత బయటికి రాకపోవడంతో రాజకీయ పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఎన్నికల పనులు చేస వారు ఎవరని నాయకులు ఎవరికివారు ప్రశ్నించుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐపీఎల్‌ను దశలవారీగా నిర్వహించనున్నప్పటికీ.. యువత ఫుల్ టైమ్ పని చేస్తారని నాయకులకు మాత్రం నమ్మకం కుదరడం లేదు!

జోరుగా బెట్టింగ్

ఐపీఎల్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. పోలీసులు నిఘా సారించినప్పటికీ ప్రత్యేక యాప్‌లలో యువత బెట్టింగ్ కాస్తున్నారు. బాల్ టు బాల్, రన్ టు రన్, ఫోర్, సిక్స్, క్యాచ్, వికెట్ తదితర అంశాలపై ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తున్నారు. కొన్నేండ్ల క్రితం మ్యాచ్‌లపై మాత్రమే బెట్టింగ్ పెట్టేవారు. కానీ సాంకేతికత అభివృద్ధి చెందిననేపథ్యంలో ఆన్‌లైన్‌లో బెట్టింగ్ జోరందుకుంది. ఆన్‌లైన్ పేమెంట్ అందుబాటులోకి రావడంతో వివిధ రకాల బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. చాలా మంది యువకులు ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో పాల్గొని ఆస్తులు అమ్ముకున్న ఘటనలు జిల్లాలో చోటు చేసుకున్నాయి.

కాదేదీ బెట్టింగ్‌కి అనర్హం..

ఐపీఎల్ మ్యాచ్ అయినా, ఎంపీ ఎన్నికైనా కాదేదీ బెట్టింగ్‌కి అనర్హం అన్నట్టు ఉంది పరిస్థితి. ఐపీఎల్ బెట్టింగ్‌తో పాటు ఎంపీ ఎన్నికలపై సైతం బెట్టింగ్‌లు కాస్తున్నారు. గెలిచేదెవరు? ఓడేదెవరు? ఎవరికి ఎన్ని ఓట్లు? జాతీయ పార్టీ వస్తుందా? ప్రాంతీయ పార్టీ వస్తుందా? ఇలా ఏ అంశాన్ని బెట్టింగ్ కోసం వదలడం లేదు.

బెట్టింగ్ యాప్‌లను నమ్మి మోసపోవద్దు

చాలా రకాల బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. వాటిని నమ్మి మోసపోవద్దు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో మోసం ఉంటుంది. యాప్ నిర్వాహకుల ప్రకారమే ఆన్‌లైన్ బెట్టింగ్ నడుస్తుంది. వీటికి యువత దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

– నరహరి, టౌన్ సీఐ, నిజామాబాద్

హనుమాన్ స్వాముల మహాపాదయాత్ర



ఆంజనేయస్వామి పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు



పాదయాత్రలో పాల్గొన్న మాలధారులు, మహిళలు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలంలోని కేంరాజ్ కల్లాలి గ్రామ హనుమాన్ ఆలయం నుంచి ఆదివారం స్వాములు, భక్తులు మిర్జాపూర్ హనుమాన్ ఆలయానికి మహాపాదయాత్ర చేపట్టారు. అంజనేయస్వామి మాలలు ధరించిన స్వాములు ప్రతి ఏటా మిర్జాపూర్ హనుమాన్ ఆలయానికి పాదయాత్ర చేస్తున్నారు. దిండి పాదయాత్రకు చుట్టు ప్రక్క గ్రామాల హనుమాన్ స్వాములు, ప్రజలు, మహిళలు తరలివచ్చి పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కేంరాజ్ కల్లాలి మాజీ సర్పంచ్ రమేష్‌దేశాయ్, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ చాంపియన్‌గా జిల్లా జట్టు



ట్రోఫీ అందుకుంటున్న జిల్లా జట్టు క్రీడాకారులు



ఉత్తమ క్రీడాకారుడు బానోత్ చందు

నిజామాబాద్ నాగారం: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈనెల 23 నుంచి 24వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో నిర్వహించిన 8వ రాష్ట్ర సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొన్నది. ఫైనల్స్‌లో మెదక్ జట్టుపై 4 – 0 పరుగుల తేడాతో విజయం సాధించిన జిల్లా జట్టు టోర్నీ చాంపియన్‌గా నిలిచింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి కె శోభన్‌బాబు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ హాజరై ట్రోఫీతోపాటు క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. టోర్నమెంట్‌లో బెస్ట్ పిచ్చర్‌గా బానోత్ చందు (సాంఘిక సంక్షేమ పాఠశాల, బోధన్) ప్రత్యేక బహుమతి అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గంగామోహన్ తెలిపారు. జిల్లా జట్టు కోచ్ మేనేజర్లుగా మార్కంటి గంగామోహన్, ఇట్యాల నరేష్, తేజావత్ గంగాధర్ వ్యవహరించారు. జిల్లా జట్టు రాష్ట్ర చాంపియన్‌గా నిలవడంపై జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి కొప్పూరి సంగీతరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొ జ్జ మల్లేశ్‌గౌడ్, సాంఘిక విద్యాసంస్థల జిల్లా కో ఆర్డి నేటర్ పి నీరజారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అవినీతికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి



వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పాలకమండలి (ఈసీ) సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని, అవినీతికి పాల్పడిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెయూ ఏబీవీపీ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, చారి మాట్లాడుతూ.. గతంలో వీసీగా పనిచేసిన రవీందర్‌గుప్తా హయాంలో జరిగిన అవినీతిలో పలువురు అధ్యాపకులు, సిబ్బంది భాగస్వామ్యం ఉందన్నారు. వీటిపై పాలకమండలి సమావేశాల్లో చేసిన పలు తీర్మానాలను అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. అలాగే వర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ నాయకులు పావని, మణి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి



ఇన్‌చార్జి వీసీ వెంకటేశంను సన్మానిస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ లో విధులు నిర్వర్తిస్తున్న తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశంకు అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆదివారం వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ఇన్‌చార్జి వీసీని వారు సన్మానించారు. ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది మాట్లాడుతూ.. తాము గత 15 సంవత్సరాలుగా అతి తక్కువ జీతంతో పని చేస్తూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించగా, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఇన్‌చార్జి వీసీ అన్నారు. కార్యక్రమంలో అవుట్ సోర్సింగ్ యూనియన్ సభ్యులు సురేశ్, నరేశ్, రవీంద్రనాయక్, శ్రీధర్, గులాబ్, తోట సురేశ్, రమేశ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): చెరువులో దిగిన గేదెలను బయటకు తోలేందుకు వెళ్లిన పశువుల కాపరి నీట మునిగి మృతి చెందిన సంఘటన నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేట్‌కు చెందిన జూకంటి రాజు (34) గేదెలను తోలుకొని గ్రామశివారులోని జిగ్గ చెరువు ప్రాంతానికి వెళ్లాడు. గేదెలు చెరువులోకి దిగడంతో వాటిని బయటకు కొట్టేందుకు ప్రయత్నిస్తుండగా రాజు ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..



మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ - కల్లెడి రోడ్డుపై బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మానిక్‌బండార్ శివారులోని మహాలక్ష్మీనగర్ కాలనీకి చెందిన సాయికుమార్(24) పనినిమిత్తం కల్లెడికి వెళ్తుండగా చిన్నాపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలుకావడంతో సాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రుద్రూర్: మండల కేంద్రానికి చెందిన జలోజి అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జలోజీ కుటుంబం గత కొన్ని నెలలుగా ఇంటికి తాళం వేసి అద్దె ఇంట్లో ఉంటున్నారు. శనివారం రాత్రి దుండగులు తాళం పగులగొట్టి వెండి, ఇత్తడి సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు జలోజీకి సమాచారం అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మరో ఐదుగురిపై కేసులు నమోదయ్యాయన్నారు. పట్టుబడిన వారిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అదుపు తప్పిన డీసీఎం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మక్కల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ మండలంలోని ఎల్లమ్మకుంట ఘాట్ రోడ్డులో ఆదివారం అదుపు తప్పింది. గాంధారి మండలంలోని పలు గ్రామాల రైతులకు చెందిన మొక్కజొన్న లోడ్‌తో డీసీఎం నిజామాబాద్ వైపు వెళ్తుండగా ఎల్లమ్మకుంట శివారులో అడవి పందుల గుంపు అడ్డుగా వచ్చింది. దీంతో వాహనం అదుపు తప్పింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని నిలిపేశారు. ఎల్లమ్మకుంట శివారులో రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, ఒక వాహనం వెళ్తే మరో వాహనం వెళ్లే పరిస్థితి లేదని, రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రాణం తీసిన కారు సరదా



సుధీర్ (ఫైల్)



ఘటనాస్థలంలో బోల్తాపడిన కారు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కొత్త కారులో సరదాగా తిరిగేందుకు వెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని చిన్న తక్కడ్‌పల్లి చౌరస్తా సమీంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బిచ్కుందకు చెందిన సింగీతం చేతన్(39) వారం రోజుల క్రితం కొత్త కారు కొన్నాడు. శనివారం రాత్రి తన స్నేహితుడైన సుధీర్(40) ఇంటికి వెళ్లి తాను కొత్తకారు కొన్నానని, సరదాగా తిరిగి వద్దామని ఇంటి నుంచి బయల్దేరారు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి 12గంటల సమయంలో పెద్దకొడప్‌గల్ మండలం చిన్నతక్కడ్‌పల్లి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారి 161పై కారు అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. ఈ ఘటనలో సుధీర్ తలకు బలమైన గాయాలు కాగా, చేతన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, పోలీసులు బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా, సుధీర్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. చేతన్ అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడపడంతో ప్రమాదం జరిగిందని మృతుడు సుధీర్ భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

అప్పులు, కేసుల నుంచి బయటపడే మార్గం లేక ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): అప్పులు, కేసుల నుంచి బయటపడే మార్గం లేక జీవితంపై విరక్తిచెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కాలి ప్రశాంత్(35) నేరల్ గ్రామానికి ఇల్లరికం వెళ్లాడు. చెడు అలవాట్లకు బానిసైన ప్రశాంత్ భార్యాపిల్లలను పట్టించుకోకుండా జులాయిగా తిరిగేవాడు. మద్యానికి బానిసై అప్పులపాలైన ప్రశాంత్‌పై పలు పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ క్రమంలో అప్పులు తీర్చేమార్గం లేక, కేసుల నుంచి బయటపడే మారగం లేక జీవితంపై విరక్తిచెంది ఎల్లమ్మగుడి సమీపంలోని చింత చెట్టుకు శనివారంఅర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొడవల కారణంగా చెరువులో దూకి..



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రానికి చెందిన ఎరుకలి గంగాధర్ (27) ఆదివారం మధ్యాహ్నం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఆర్.లావణ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మద్యానికి బానిసైన గంగాధర్ పని చేయకుండా తిరుగుతూ ప్రతిరోజూ భార్య, తండ్రితో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం కూడా ఇంట్లో గొడవపడి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ వద్ద అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఖలీల్‌వాడి: నగరంలోని ఇంద్రపూర్ కాలనీ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్ సమీపంలోని పంటపొలాల్లో గుర్తు తెలియని వ్యక్తి బీడీ కాల్చిపారేయడంతో మంటలు అంటుకున్నాయి. అక్కడే ఉన్న వ్యవసాయభూములకు కరెంట్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ మంటల్లో కాలిపోయింది. దీంతోపాటు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్‌లోకి మంటలు వ్యాపించాయి. రిపేర్ సెంటర్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా, ఘటనాస్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. సరైన సమయంలో స్పందించడంతో రూ.కోటి ఆస్తి నష్టం తప్పిందన్నారు. వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా చేసే రూ.1.50 విలువైన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



భిక్కనూరు: మండలంలోని తిప్పాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. సమ్మేళరంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో సర్టిఫికెట్ల ప్రదానం



నిజామాబాద్, నాగారం: నగంరలోని బస్వాగార్డెన్స్‌లో ఆదివారం తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్, సర్టిఫికెట్ల ప్రదానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా డిస్టిక్ తైక్వాండ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, జేసీఐ ఇందూర్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ బెల్టులు, సర్టిఫికేట్లను సీనియర్ క్రీడాకారులకు అందజేశారు.

లాస్య హంతకులను కఠినంగా శిక్షించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో శనివారం హత్యకు గురైన లాస్య కేసులో హంతకులను కఠినంగా శిక్షించాలని మృతురాలి బంధువులు ఆదివారం పట్టణం అంబేడ్కర్ చౌరస్తాలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బంధువులు మాట్లాడుతూ.. లాస్య హత్య కేసులో పోలీసులు హంతకులను త్వరగా పట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. హంతకులను త్వరగా పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఆటిజం క్లినిక్ సీజ్



నిజామాబాద్ నాగారం: 'ఆటిజం పేరుతో ఆటలు' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఎలాంటి అర్హతలు లేకున్నా స్పీచ్ థెరపీ పేరుతో పిల్లల జీవితాలతో ఆటలాడుతూ డబ్బులు దండుకుంటున్న వైనంపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. ఈనెల 16న ఫిజియోథెరపీ అసోసియేషన్ సభ్యులు సైతం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, గంగాధర్ శనివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించి క్లినిక్‌ను సీజ్ చేశారు.

సాక్షి ఎఫెక్ట్..